వేదారణ్యం పేరులో వేదం వున్నా అది స్మగ్లర్ల స్వర్గం కావడానికి ముఖ్యకారణం - అది శ్రీలంక ఉత్తర తీరానికి అతి దగ్గరగా (పాయింట్ కాలిమెర్ నుండి 28 కి.మీ.లు మాత్రమే) వుండడం. పైగా భారత సముద్రతీరం వెంబడే ఊళ్లు వుండడం. (పక్కనున్న మ్యాప్ చూడండి) ఎల్‌టిటిఇ నిధుల సేకరణంతా స్మగ్లింగ్ మీదనే ఆధారపడి వుందని అందరికీ తెలుసు. దేశవిదేశాలనుండి పట్టుకుని వచ్చిన మాదకద్రవ్యాలు, ఆయుధాలు అమ్ముకోవడానికి భారత్ పెద్ద మార్కెట్, భారత్ ద్వారా తక్కినదేశాలకు రవాణా చేయవచ్చు. తీరానికి వచ్చిన కాన్సేపటికే గ్రామంలోకి తెచ్చేసి తరలింపు ప్రారంభించవచ్చు. అందువలన శ్రీలంక నుండి యిక్కడకు నిరంతరం బోట్లు తిరుగుతూ వుంటాయి. వాళ్లను కస్టమ్స్‌వాళ్లు పట్టుకుంటే అమాయక జాలర్లు చేపలు పట్టుకుంటూ వుంటే పట్టుకున్నారని యాగీ చేయవచ్చు. ఇప్పటికి కూడా తమిళ రాజకీయనాయకులు అరెస్టయిన శ్రీలంక జాలర్ల గురించి, భారతీయ జాలర్ల గురించి వాపోతూనే వుంటారు.




ఈ జాలరి కుటుంబాలు సముద్రతీరం వెంబడే ఆవాసాలు ఏర్పరచుకుని వున్నాయి. వీళ్లు త్వరగా, సులభంగా డబ్బు సంపాదించడం మరిగారు. ఒక చిన్న ఉదాహరణ చెప్పాలంటే డీజిల్ పెట్రోలు బంకులో లీటరు 4 రూ.లకు దొరికేది. దాన్ని పట్టుకుని వచ్చి అధికారుల కంటపడకుండా షణ్ముగం వంటి స్మగ్లరుకు బోటు దగ్గరకు అందిస్తే లీటరుకు 20 రూ.లు ముడుతుంది. శ్రీలంక నుండి బోటు వచ్చే టైముదాకా వెయిట్ చేసి దానిలో లోడ్ చేస్తే లీటరుకి 30 రూ.లు యిచ్చేవారు. ఇంతింత యిస్తే అవతలి వాళ్లకేం లాభం అంటారా.. శ్రీలంక సైన్యం, భారత శాంతిదళం జాఫ్నా ప్రాంతాన్ని చుట్టుముట్టి ఎల్‌టిటిఇకి పెట్రోలు, డీజిల్ అందకుండా చేసేది కాబట్టి అక్కడకు పట్టుకెళ్లి లీటరు 90 రూ.లకు అమ్ముకోవచ్చు. మెషిన్‌తో నడిచే బోటులో చేపల వేటకు వెళ్లాలంటే రోజుకు 30 లీటర్ల డీజిల్ కావాలి. అందుకుని వాళ్లు ఎంత ధరైనా పెట్టి కొంటారు. కొద్దిపాటి రిస్కుతో యింత డబ్బు సంపాదించే అవకాశం వుంటే ఎవడు మాత్రం నిజాయితీగా వుంటారు? మామూలుగా కూలీకి వెళితే వచ్చేది రోజుకు 15 రూ.లు. కాస్త రిస్కు తీసుకుని యీ పని చేస్తే కనీసం 50 రూ.లు. అందువలన అక్కడి యువకులందరూ స్మగ్లర్ల చుట్టూ చేరేవారు. ఎల్‌టిటిఇ అంటే సానుభూతి చూపేవారు.

స్మగ్లింగ్ కార్యకలాపాలకు అత్యంత అనుకూలమైన చోటు - ఆదిరామపట్టణం నుండి పాయింట్ కాలిమెర్ వరకు. అక్కడ 20 వేల హెక్టార్లలో ముత్తుపేట లగూన్ (సముద్రతీరంలో వుండే పెద్దమడుగు) వుంది. దాన్నిండా చిన్న చిన్న దీవులు. 40 కి.మీ.లు వ్యాపించిన దుబ్బులు, తుప్పలు. దాక్కోవడం అతి సులభం. కస్టమ్స్ వారు కాదు, ఎవరైనా సరే దానిపై నిఘా వేసి వుంచడం దాదాపు అసాధ్యం. (పక్కనున్న వేదారణ్యం ప్రాంతం ఫోటో చూడండి) పెట్రోలు బంకుల వాళ్లు కూడా పెట్రోలు, డీజిల్ స్మగ్లర్లు యిచ్చే బంగారు బిస్కెట్లకు ఆశపడి అమ్మడానికి ఉత్సాహంగా వుండేవారు. చెక్‌పోస్టులు ఎన్ని పెట్టినా పట్టుబడేది అతి స్వల్పం. ఎల్‌టిటిఇ వద్ద అత్యాధునికమైన ఆయుధాలూ, బోట్లు వుండేవి. వాళ్లు 30 ని။లలో అవతలిగట్టుకి వెళ్లిపోయేవారు. మన కస్టమ్స్ అధికారుల వద్ద వుండేవి కాలం చెల్లిన బోట్లు, ఆయుధాలు. వాళ్లు ఈ ఎల్‌టిటిఇ వారిని ఏం పట్టుకోగలరు? పట్టుకున్నా వాళ్లకే ప్రమాదం. ఒక్కోప్పుడు ఎల్‌టిటిఇ వాళ్లే వాళ్లను బంధించి జాఫ్నాకు తీసుకుని వెళ్లిపోయి బందీలుగా అట్టేపెట్టుకుని బాగా బెదిరించి పంపేవారు. ఓ సారి వారంరోజులైనా వదలకపోతే స్మగ్లర్ షణ్ముగమే తమిళపులులకు వాళ్లకు నచ్చచెప్పి అధికారులను విడిపించాడు. ఇలాటి పరిస్థితుల్లో కస్టమ్స్‌వారు స్మగ్లర్‌లను ఏం అదుపు చేస్తారు?



రాజీవ్ హత్య జరగడానికి రెండేళ్ల ముందే వేదారణ్యం ప్రాంతంలో స్మగ్లింగ్ చాలా పెరిగింది. దండకారణ్యంలో మావోయిస్టులు సమాంతర ప్రభుత్వం నడిపినట్లు ఆ ప్రాంతాలలో ఎల్‌టిటిఇ మాటే చెల్లుబాటయ్యేది. మామూలుగా ఏదైనా హత్య జరిగితే హంతకుడు దేశం విడిచి పారిపోవడం అనేది చాలా కష్టతరమైన విషయం. కానీ ఎల్‌టిటిఇ విషయంలో అది ఎంత సులభమో చెప్పడానికి వేదారణ్యం గురించి యింత వివరంగా చెప్పవలసి వచ్చింది. రాజీవ్ హత్యకు ముందు, వెనకా ఎల్‌టిటిఇ వారు చిత్తం వచ్చినట్టు రాకపోకలు సాగించడానికి ఎంత అనువైన వాతావరణం వుందో మనకు దీన్ని బట్టి అర్థమౌతుంది.

ఈ ప్రాంతంలో భౌగోళిక అనుకూలతతో బాటు, వ్యక్తుల సహకారం కూడా ఎంతో వుంది. అలాటి వారిలో గతవ్యాసంలో పరిచయం చేసిన కె (కొడియకాదు) షణ్ముగం ఒకడు. అతనికి ప్రభాకరన్‌తో, బాలసింగంతో ప్రత్యక్షపరిచయం వుండేది. షణ్ముగాన్ని స్మగ్లింగ్‌లోకి దింపినది వాళ్ల బాబాయి సీతారామన్. అతను పోస్ట్‌మన్‌గా పనిచేసేవాడు. తమాషా ఏమిటంటే రాజీవ్ హత్య తర్వాత షణ్ముగం పట్టుబడి పోలీసు కస్టడీలో వున్నపుడు ఈ సీతారామన్ తిండి తినిపించడానికంటూ వచ్చి అతన్ని చెడామడా తిట్టాడు, ఇలాటి

ఎల్‌టిటిఇతో చేతులు కలుపుతావా అని. దాంతో బాధ వేసిన షణ్ముగం కస్టడీలోంచి పారిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. కాదు పోలీసులే హత్య చేశారని పత్రికల వాళ్లన్నారు. ఆ కథ తర్వాత వస్తుంది. ఈ దశలో ఈలం తీవ్రవాదులను, స్మగ్లర్‌లను దేశం దాటించడంలో షణ్ముగంది అందె వేసిన చేయి అని తెలుసుకుంటే చాలు.

ఇటువంటి షణ్ముగంకు సహాయకుడిగా పనిచేసినవాడు మహాలింగం. వీడు జాఫ్నాలోని మధకల్ నుంచి వచ్చిన జాలరి. 1984లో వచ్చి షణ్ముగం వద్ద పనికి చేరి తమిళ పులలకు చెందిన బోట్లను నడుపుతూండేవాడు. శ్రీలంక కాలవల్లో ప్రతి అంగుళం వాడికి కొట్టిన పిండి. ఎల్‌టిటిఇ మనుషులందరి గురించీ బాగా తెలుసు. 1990లో పద్మనాభ హత్యను దిగ్విజయంగా ముగించి పారిపోయిన శివరాజన్, డేవిడ్ బృందాన్ని జాఫ్నానుండి తీసుకుని వచ్చినదీ, మళ్లీ జాగ్రత్తగా వెనక్కి తీసుకుని వెళ్లినదీ వీడే !

ఎల్‌టిటిఇ లో రెండు విభాగాలున్నాయి. రాజకీయవిభాగం ఒకటి, ఇంటెలిజెన్సు విభాగం మరోటి. రాజకీయవిభాగంలో పనిచేసే కాంతన్, డిక్సన్ అనే యిద్దర్ని ముందుగానే పంపి మద్రాసు, కోయంబత్తూర్‌లలో క్యాంపులు నడిపారు. క్యాంపు నడపాలంటే వైర్‌లెస్ సెట్టూ వుండాలి, దానికో ఆపరేటరూ వుండాలి. కాంతన్ అనే అతని వైర్‌లెస్ ఆపరేటర్ రమణన్ అనే అతన్ని వైర్‌లెస్ సెట్టుతో సహా 1991 జనవరిలో ఇండియాకు తీసుకుని వచ్చాడు ఈ మహాలింగం. శివరాజన్ ముఠాను మే 1 న తెచ్చినవాడూ వీడే. ఆ విధంగా వీడు రాజీవ్ హత్యలో ఓ పాత్రధారి అయ్యాడు.

స్మగ్లర్ల గురించి చెప్పుకుంటున్నాం కాబట్టి వానన్ అనే శ్రీలంక జాతీయుడైన స్మగ్లర్ గురించి కూడా రెండు ముక్కలు యిక్కడే చెప్పుకుందాం. అతను శివరాజన్‌కు సహాయకుడిగా పనిచేస్తూ మద్రాసులో మడిపాక్కంలో వుండేవాడు. అవసరమైతే రాజీవ్‌ను స్వంతవూరులోనే చంపించడానికి శివరాజన్ ఢిల్లీలో కూడా ఓ క్యాంప్ నడుపుదామని చూశాడు. ఒక ముసలాయనను, ఒక యువతిని ఆ పనికై నియోగించి వాళ్లని ఢిల్లీకి తీసుకెళ్లి యిల్లు చూసే పనిని యీ వానన్‌కు అప్పగించాడు. ఢిల్లీ క్యాంప్ గురించి చెప్పుకున్నప్పుడు ఆ వివరాలు యిస్తాను.

వేదారణ్యం క్యాంప్ గురించి తెలిసింది కదా, యిక మద్రాసు శుభాసుందరం, భాగ్యనాథన్ క్యాంపుల గురించి వచ్చే సోమవారం.
(సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**